క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు పంపిణీ చేస్తున్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు

రేపల్లె రూరల్: మండలంలోని చోడాయపాలెం గ్రామానికి చెందిన బొమ్మిడి అప్పారావు కుటుంబ సభ్యులకు రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు గురువారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మోపిదేవి మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పరిధిలో లేని వ్యాధులబారిన పడిన వారిని ఆదుకునేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అప్పారావు గత కొన్ని రోజులుగా ఓ వ్యాధితో బాధపడుతున్నాడని, అతని వైద్యఖర్చుల నిమిత్తం రూ.3.50లక్షల సీఎం రిలీఫ్ ఫండ్‌ను అందజేశామన్నారు.

నేడు అమావాస్య హోమం

పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న బగళాముఖి అమ్మవారి దేవాలయంలో ఈనెల 19వ తేదీన అమావాస్య సందర్భంగా అమావాస్య హోమం జరుగుతుందని తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆలయ ఈఓ ఘంటసాల నరసింహమూర్తి మాట్లాడారు. ఈనెల 21 వతేదీన దేవాలయంలో అన్నసంతర్పణ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈనెల 3వ తేదీనుంచి 7వ తేదీ వరకు బండ్లమ్మ వారి వార్షిక తిరునాళ్ళ కార్యక్రమంలో భాగంగా 21న 16 రోజుల పండుగ సందర్భంగా అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి భక్తులు, దాతల సహకారంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

అద్దేపల్లిలో ప్రత్యేక పూజలు

అద్దేపల్లి(భట్టిప్రోలు): భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లిలో నూతనంగా నిర్మించిన కోదండరామాలయంలో సీతారామలక్ష్మణ హనుమత్ విగ్రహాలకు షోడసోప పర్వం పురస్కరించుకుని గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వార్లకు పంచామృత స్నపన, అష్టోత్తర శతనామ పూజలు శాస్త్రయుక్తంగా జరిపారు. స్వామి వార్లకు పట్టు వస్త్రాలు, పుష్ప, ముత్యాల హారాలు, కిరీటధారణ అలంకారాలు చేశారు. పూజా కార్యక్రమాలలో పసుపులేటి సాంబశివరావు-రమాదేవి దంపతులు పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలను వేదవ్యాస వంగర చలమయ్య సిద్ధాంతి ఆధ్వర్యంలో పోతార్లంకకు చెందిన వినుకొండ మురళీకృష్ణ వెంకట నరసింహమూర్తి శిష్య బృందం శాస్త్రోక్తంగా జరిపారు.

జూదరుల అరెస్ట్

రేపల్లె: పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్న సంఘటన మండలంలోని బేతపూడి గ్రామంలో చోటు చేసుకుంది. సీఐ విజయచంద్ర వివరాల మేరకు తమకు అందిన సమాచారంతో బేతపూడి గ్రామంలో బుధవారం అర్ధరాత్రి తమ సిబ్బందితో దాడులు నిర్వహించామన్నారు. దాడులలో ఎనిమిది మంది వ్యక్తులు పేకాట ఆడుతూ పట్టుబడ్డారని, వీరి వద్ద నుంచి రూ.9,370 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను గురువారం కోర్టులో హాజరుపరచినట్లు చెప్పారు.

ఆది ఆంధ్రసొసైటీపై విచారణకు ఆదేశం

బాపట్ల: బాపట్ల పట్టణంలోని ఆది ఆంధ్రసొసైటీలో అవకతవకలు జరిగాయంటూ సొసైటీ సభ్యుడు దగ్గుమల్లి ధర్మరావు ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ చేపట్టాలని ఆర్డీఓ రవీంద్ర ఆదేశాలు జారీ చేశారు. విచారణ అధికారిగా బాపట్ల తహసీల్దార్‌ను నియమించారు. సొసైటీలో అవినీతి జరుగుతుందని సభ్యుడు ధర్మరావు ఇచ్చిన ఫిర్యాదుపై పూర్తి స్థాయిలో విచారణ సమర్పించాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వెల్లటూరు(భట్టిప్రోలు): మద్యం తాగి ఇంటికి రావొద్దని భార్య గట్టిగా చెప్పడంతో మనస్థాపానికి గురై భర్త పురుగుల మందు సేవించి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన ఇది. పోలీసుల కథనం ప్రకారం భట్టిప్రోలు మండలం వెల్లటూరుకు చెందిన గుంటూరు వసంతరావు(52) నిత్యం మద్యం తాగి వస్తుండడంతో భార్య గుంటూరు రాణి గట్టిగా మందలించడంతో ఈ నెల 11వ తేదీన పురుగుల మందు తాగాడు. మెరుగైన చికిత్సకై వసంతరావును గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. వీరికి ఇద్దరు పిల్లలు. ఇద్దరికీ వివాహాలయ్యాయి. భార్య రాణి ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ ఇ.వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జెడ్పీటీసీ భర్తపై దాడి

తాడికొండ: తాడికొండ జెడ్పీటీసీ సభ్యురాలు గుడిమెట్ల జ్యోతి భర్త గుడిమెట్ల వీర్లంకయ్యపై గుర్తుతెలియని వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. తాడికొండ మండలం నిడుముక్కల-లచ్చన్నగుడిపూడి గ్రామాల మధ్య అక్రమంగా క్వారీయింగ్ జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు బీరు సీసాతో తలపై దాడి చేశారని ఫిర్యాదు చేశారు. దాడిలో తలకు బలమైన గాయమై రక్తం కారడంతో స్థానికుల సాయంతో జీజీహెచ్‌కు తరలించి చికిత్స అనంతరం తాడికొండ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జి శ్రీనివాసరావు తెలిపారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

- రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున
- చినపులివర్రులో గడప గడపకు మన ప్రభుత్వం



ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలతో లబ్ధిపొందుతున్నట్లు మంత్రికి తెలియజేస్తున్న మహిళ

కొల్లూరు: వెనుకబడిన వర్గాల్లో ఆర్థిక ఇబ్బందులు తొలిగి సంక్షేమం వెల్లివిరవాలన్న లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందజేస్తున్నారని రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. గురువారం మండలంలోని చినపులివర్రులోని బీసీ, ఓసీ ఏరియాల్లో రెండవ రోజు నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం ద్వారా అందుతున్న సంక్షేమ పథకాలను వివరించి బుక్‌లెట్‌లు అందజేయడంతోపాటు, ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు పంపిణీ చేస్తూ సంక్షేమ పాలన చేస్తోందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడంతోపాటు, ప్రకటించని హామీలను సైతం అమలు చేస్తూ దేశానికే ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రభుత్వానికి తిరిగి ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలిచి అధికారంలోకి తీసుకురావాలన్నారు. ప్రజల విశ్వాసాన్ని కోల్పోయి ఎన్నికల్లో ఘోర ఓటమి చవిచూసిన టీడీపీ చేస్తున్న దుష్ప్రచారాలను ఏఒక్కరు నమ్మవద్దని అన్నారు. గతంలో ప్రజా సంక్షేమాన్ని విస్మరించి టీడీపీ నాయకులు ధనార్జనే ధ్యేయంగా అవినీతి పాలన సాగించడంతో పాటు, తిరిగి ఇప్పుడు అధికారంలోకి వచ్చేందుకు జనసేన పార్టీని అడ్డుపెట్టుకోవాలని పన్నాగాలు పన్నుతున్నారని ప్రజలందరూ అప్రమత్తంగా వ్యవహరిస్తూ ప్రజలకు మేలు చేసే వైఎస్సార్ సీపీని మళ్లీ గెలిపించాలన్నారు. వ్యవసాయ రంగంపై ఆధారపడిన డెల్టా ప్రాంతాన్ని అభివృద్ధిలోకి తీసుకువచ్చేందుకు వైఎస్సార్ సీపీ నిరంతరం కట్టుబడి ఉందని అన్నారు. రైతాంగాన్ని ఆదుకోవాలన్న ధ్యేయంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా అందజేయడంతో పాటు, పండించిన పంటలను కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసి మద్దతు ధర కల్పించడం, పంట నష్టపరిహారం అందజేయడం ద్వారా రైతాంగానికి వెన్నుదన్నుగా నిలుస్తున్నారన్నారు. గ్రామంలో అంతర్గత రహదారుల సమస్యను స్థానికులు ఆయన దృష్టికి తీసుకురావడంతో సుమారు రూ. 12 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టడంతో పాటు, ఇతర సమస్యలు సైతం పరిష్కరిస్తామని ఆయన ఈసందర్భంగా హామీ ఇచ్చారు. కొల్లూరు వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, కిష్కిందపాలెం, తోకలవారిపాలెం సర్పంచులు గుంటూరు నీలాంబ్రం, టి. కృష్ణమోహన్, ఎంపీటీసీ సభ్యులు అమిరిశెట్టి శ్రీధర్, ఇంటూరి ప్రవీణ్, పొలిమట్ల ఆనంద్, వైఎస్సార్ సీపీ నాయకులు కూచిపూడి మోషే, చిలక ప్రకాశం, ఉప్పు శ్రీనివాసరావు, చందోలు డేవిడ్ విజయకుమార్, తోడేటి రత్నాకర్, దున్న వెంకయ్య, కనపర్తి మోహన్‌రావు, మాతంగి రత్నకుమార్, బాణాల రవి, కసుకుర్తి ప్రసాద్, వెనిగళ్ల బాబురావు, చాట్రగడ్డ రామకృష్ణ, మర్తి ఫణి, గుర్రం రామంజనేయులు, దున్న బాబురావు, తోట నాగరాజు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు శొంఠి సుబ్బరావు, ఎంపీడీఓ ఐ. సత్యనారాయణరావు, తహసీల్దార్ ఎ. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఓర్వలేకే దిగజారుడు వ్యాఖ్యలు

- ఇళ్ల స్థలాలపై చంద్రబాబు వ్యాఖ్యలపై సర్వత్రా వ్యతిరేకత
- దిష్టిబొమ్మ దహనం



చంద్రబాబు నాయుడు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

బాపట్ల అర్బన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు చూసి ఓర్వలేక చంద్రబాబు నాయుడు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ బాపట్ల మండల అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి విమర్శించారు. మండలంలోని వెదుళ్లపల్లి సెంటర్‌లో గురువారం జరిగిన నిరసన కార్యక్రమంలో చంద్రబాబు నాయుడు దిష్టిబొమ్మను దహనం చేశారు. పేదలకు పంపిణీ చేస్తున్న ఇళ్ల పట్టాల విషయంలో సెంటు భూమి శవాన్ని పెట్టడానికి కూడా చాలదని హేళన చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పనిచేసి మతిలేని వ్యాఖ్యలు చేయడం చంద్రబాబుకే తగిందన్నారు. బాపట్ల ఎంపీపీ చిన్న పోతుల హరిబాబు, వడ్డీముక్కల డేవిడ్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గవిని కృష్ణమూర్తి, సర్పంచ్ కుంచాల గోవిందమ్మ, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

వేధింపుల భర్త, అత్తలపై కేసు నమోదు

కొల్లూరు: వివాహితపై అనుమానంతో వేధింపులకు గురిచేస్తున్న భర్త, అత్తలపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కొల్లూరుకు చెందిన ఉప్పు రాజశ్రీకి 11 ఏళ్ల క్రితం గుంటూరు స్తంబాలగరువుకు చెందిన తాడివాక గోపికృష్ణతో వివాహమైంది. వివాహమైన కొన్నేళ్ల నుంచి భార్యను అందంగా లేవంటూ, వేరే వ్యక్తులతో మాట్లాడుతున్నావంటూ అనుమానంతో వేధింపులకు గురిచేస్తున్నాడు. మహిళ భర్తకు తోడు, అతడి తల్లి సుజాత సైతం వేధిస్తుండడంతో గురువారం బాధిత మహిళ కొల్లూరు పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజీవ్ శామ్యూల్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్ఐ బాబురావు తెలిపారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు

కొల్లూరు: అదనపు కట్నం కోసం వివాహితను వేధింపులకు గురిచేస్తున్న భర్త, అతని కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ బాబురావు తెలిపారు. మండలంలోని పెసర్లంకకు చెందిన ఆదిలక్ష్మికి మూడేళ్ల క్రితం అమర్తలూరు మండలం గోవాడకు చెందిన రామదాసు నాగేంద్రబాబుతో వివాహం జరిగింది. వివాహం అనంతరం భర్త నాగేంద్రబాబుతోపాటు, అత్త, మామ, ఆడబిడ్డలు కట్నం తీసుకురాకుండా వచ్చావంటూ మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నారు. ఇటీవల వేధింపులు అధికమవడంతో తల్లిదండ్రుల సాయంతో కొల్లూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

మద్దతు ధరకు మొక్కజొన్న కొనుగోలు



పెదకాకాని: ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు మొక్కజొన్నలు కొనుగోలు చేస్తున్నట్లు ఉప్పలపాడు సొసైటీ అధ్యక్షుడు శివాబత్తిన దయానంద్ తెలిపారు. పెదకాకాని మండలం అనుమర్లపూడి గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం ద్వారా గురువారం 50 టన్నుల మొక్కజొన్నలు కొనుగోలు చేసి తరలించారు. ఈ సందర్భంగా దయానంద్ మాట్లాడుతూ రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. క్వింటా రూ. 1962 చొప్పున రెండు లారీలు ఎగుమతి చేసినట్లు తెలిపారు. స్థానిక శాసనసభ్యుడు కిలారి వెంకటరోశయ్య ఆధ్వర్యంలో మార్క్‌ఫెడ్ సహకారంతో కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సొసైటీ సెక్రటరీ కిశోర్‌కుమార్, సభ్యులు చెన్నుపాటి కళ్యాణ్, పల్లెంపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను క్రమబద్ధీకరించుకోవచ్చు

కొల్లిపర: అభ్యంతరం లేని అనధికారికంగా ఆక్రమించుకొని ఉన్న ప్రభుత్వ భూములను 2023 డిసెంబర్ 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ జి.నాంచారయ్య తెలిపారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీఎస్ఓ 21, 26కి అనుగుణంగా 2019, అక్టోబర్ 15 నుంచి లేదా అంతకు పూర్వం అభ్యంతరం లేని అనధికారంగా ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని జీవించు చున్న వ్యక్తులకు భూమిని కేటాయించే పథకాన్ని ప్రవేశపెడుతూ 2021లో జీఓ జారీ చేసిందన్నారు. అయితే ఆ ఉత్తర్వులకు కొన్ని సవరణలు చేస్తూ ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరిలో జీఓ 60 జారీ చేసిందన్నారు. ఈ ఉత్తర్వుల ప్రకారం 100 గజాల వరకు అన్ని అర్హతలు గల దారిద్ర్యరేఖకు దిగువ, ఎగువున ఉన్న అందరికీ ఉచితంగా 'డి' పట్టా మంజూరు చేయబడుతుందని, పది ఏళ్ల లోపు భూ బదలాయింపు సంక్రమించే విధంగా, 101 నుంచి 200 చదరపు గజముల వరకు బేసిక్ విలువలో 50శాతం ప్రభుత్వానికి చెలించాలని, 201 నుంచి 300 చదరపు గజముల వరకు బేసిక్ విలువలో 100 శాతం ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుందని, 301 నుంచి 500 చదరపు గజము వరకు 150 శాతం ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుందని, 500 చదరపు గజములకు పై బడి ఉంటే ఆక్రమణలు తొలగించబడతాయన్నారు. 101 చదరపు గజముల నుంచి 500 చదరపు గజముల వరకు క్రమబద్ధీకరించుకొనుటకు పైన తెలిపిన విధంగా రుసుము చెల్లించే వారికి కన్వేయన్స్ డీడ్ ద్వారా సదరు ఆస్తికి హక్కులు బదలాయించబడతాయని పేర్కొన్నారు. అభ్యంతరం లేని అనధికారికంగా ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని మండలంలో వివిధ గ్రామాలల్లో జీవిస్తున్న వారు సదరు గృహమునకు సంబంధించిన విద్యుత్ కనెక్షన్, ఇంటి నిర్మాణ అనుమతి పత్రము, కులాయి పన్ను రసీదు, ఇతర ఆధారంతో గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ కోరారు.

లారీలను అడ్డుకున్న స్థానికులు

మంగళగిరి: నగర పాలక సంస్థ పరిధిలోని నిడమర్రులో రాత్రి వేళ రాకపోకలు సాగిస్తున్న ఇసుక, గ్రావెల్ లారీలను స్థానిక ప్రజలు బుధవారం అర్ధరాత్రి అడ్డుకున్నారు. రోడ్డుపై బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. పగలు- రాత్రి తేడా లేకుండా వందల సంఖ్యలో వాహనాలు అతివేగంగా రాకపోకలు సాగించడం వల్ల దుమ్ము, ధూళి రేగి ఇబ్బందులు పడుతున్నామని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డుపైకి రావాలంటే ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకోవాల్సి వస్తుందని వాపోయారు. రహదారి విస్తరణ పనుల నేపథ్యంలో రోడ్డును నీటితో తడపకుండా ఉండటం వల్ల ఫ్లెయాష్ దుమ్ము రేగి కళ్లల్లో పడుతుందని, ఎన్నోమార్లు ఇదే విషయాన్ని సంబంధిత కాంట్రాక్టర్‌కు చెప్పినా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి ఇసుక, మట్టి లారీలు తిరుగుతున్న ప్రాంతాల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, లేకుంటే నిడమర్రులో రోడ్డు దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు.


బాలల హక్కుల పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి

మంగళగిరి: బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ అనూష అన్నారు. గుడ్‌షెఫర్డ్ కాన్వెంట్స్ స్వచ్ఛంద సేవా సంస్థ చైల్డ్ ప్రొటెక్షన్ ఇన్‌చార్జి సిస్టర్ లత ఆధ్వర్యంలో గురువారం నగరంలోని దళితవాడ ఎలిమెంటరీ పాఠశాలలో బాలల హక్కుల పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దళిత శిబిరం చైల్డ్ ప్రొటెక్షన్ నూతన కమిటీని ఎన్నుకుంది. అధ్యక్షుడిగా కురగంటి ఆదామ్, కార్యదర్శిగా వి బుజ్జిని ఎన్నుకున్నారు. దళితవాడలో బాల్య వివాహాలు జరుగకుండా, బాలలపై లైంగిక వేధింపులు జరగకుండా తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఎం అరుణ, ఆర్‌పీ జ్యోతి, మధులత, బ్లెస్సీ, ప్రియాంక, గుడ్‌షెఫర్డ్ ప్రతినిధులు ఎస్ నాగమణి, బి విజయలక్ష్మి, డి అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనదారునికి తీవ్రగాయాలు

మంగళగిరి: నగర పాలక సంస్థ పరిధిలోని యర్రబాలెం-పెనుమాక రహదారి మార్గంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ద్విచక్ర వాహనదారునికి తీవ్రగాయాలయ్యాయి. సేకరించిన వివరాల మేరకు... యర్రబాలెంకు చెందిన భీమవరపు నాగయ్య గేదెల మేత కోసం తన ద్విచక్రవాహనంపై పెనుమాక వైపు బయలుదేరాడు. మర్రిచెట్టు ఎదుట ఉన్న డొంకరోడ్డు వద్ద పంట పొలానికి వెళ్లేందుకు మలుపు తిరుగుతున్నాడు. ఈ క్రమంలో వెనుక వైపు నుంచి వచ్చిన కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో నాగయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని వైద్య పరీక్షల నిమిత్తం హుటాహుటీన ఎయిమ్స్‌కు తరలించారు.

కొనసాగుతున్న హనుమజ్జయంతి ఉత్సవాలు



తెనాలిటౌన్: షరాఫ్‌బజార్‌లోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి ఉత్సవాలు, హనుమాన్ చాలీసా పారాయణ వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారికి 1108 లడ్డూలతో విశేష అర్చనలు నిర్వహించారు. హనుమాన్ చాలీసా పారాయణ, సుందరకాండ పారాయణ జరిపారు. ఆలయ వంశ పారంపర్య అర్చకులు ఆర్.శ్రీనివాసమూర్తి, కిరణ్, సురేష్, ఆలయ కార్యనిర్వహణాధికారి అవుతు శ్రీనివాసరెడ్డి, సంకీర్తనా బృందం అధ్యక్షురాలు మూర్తి అనూరాధ, సేవా సమితి సెక్రటరీ మూర్తి వెంకటేశ్వరరావు, ఎం.చంద్రశేఖర్, గుడివాడ బాలకృష్ణ, లీలాప్రసాదరావు, వెంకటేష్, బృందం సభ్యులు పద్మావతి, విజయలక్ష్మి, లక్ష్మీసునీత, రామలక్ష్మి, జ్యోతి పాల్గొన్నారు.

గాయత్రీదేవికి లక్ష మల్లెల పూజ



చేబ్రోలు: కొత్తరెడ్డిపాలెం ఆనందాశ్రమంలోని గాయత్రీదేవి అమ్మవారికి గురువారం లక్ష మల్లెల పూజ నిర్వహించారు. అర్చకుడు వంశీకృష్ణ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, విశేష కార్యక్రమాలు, అభిషేకాలు జరిగాయి. మేధా దక్షిణామూర్తికి పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకారంలో భీమేశ్వరస్వామి

వసంత రుతువు వైశాఖ మాస శివరాత్రి సందర్భంగా చేబ్రోలులోని భీమేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. వసంత రుతువులో లభ్యమయ్యే పూలు, పండ్లతో పూజలు, అలంకరణను అర్చకులు నిర్వహించారు. మల్లెపూలు, మామిడి ఫలాలతో పూజలు చేశారు. ప్రత్యేక అలంకారంలో భీమేశ్వరస్వామి భక్తులకు దర్శనమిచ్చారు.

ప్రజల సమస్యలు పరిష్కరించాలి

బాపట్ల డీఎల్‌పీఓ శరత్‌బాబు



ఏట్రవారిపాలెం సంపద సృష్టి కేంద్రాన్ని సందర్శించిన డీఎల్‌పీఓ శరత్‌బాబు

కర్లపాలెం: ప్రజల సమస్యలు సకాలంలో పరిష్కరించాలని బాపట్ల డీఎల్‌పీఓ పీడీఎస్ శరత్‌బాబు సిబ్బందిని ఆదేశించారు. డీఎల్‌పీఓ శరత్‌బాబు గురువారం ఏట్రవారిపాలెం గ్రామ సచివాలయాలను, సంపద సృష్టి కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయం సిబ్బందితో మాట్లాడుతూ ప్రతిరోజూ సాయంత్రం జరిగే గ్రీవెన్స్ కార్యక్రమానికి సిబ్బంది అందరూ ఉండాలని చెప్పారు. ప్రతిరోజూ వస్తున్న అర్జీలను గ్రీవెన్స్ రికార్డుల్లో తప్పనిసరిగా నమోదు చేయాలని ఫిర్యాదుదారుని ఫోన్ నంబర్ కూడా తప్పనిసరిగా తీసుకోవాలని ఆదేశించారు. గ్రీవెన్స్‌కు అర్జీలు రాకపోయిన ఆ విషయాన్ని రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. సమస్యలపై సచివాలయానికి వచ్చే ప్రజలతో సిబ్బంది గౌరవంగా వ్యవహరించాలని, వారి సమస్యలకు సరైన సమాధానం ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లకు పూర్తి అవగాహన ఉండాలని ఆయన పేర్కొన్నారు. అర్జీ పెట్టుకున్న వారికి ఏవైనా పథకాలు మంజూరు కాకపోతే ఎందుకు మంజూరు కాలేదో వారికి తెలపాల్సిన బాధ్యత సచివాలయం సిబ్బందిపై ఉందని డీఎల్‌పీఓ స్పష్టం చేశారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి డి.పద్మావతి, చీరాల శ్రీనివాసరెడ్డి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఇటుక బట్టీలలో రక్షణ చర్యలు చేపట్టాలి



కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న అసిస్టెంట్ లేబర్ అధికారిణి సాయిజ్యోతి

కొల్లూరు: ఇటుక పరిశ్రమతో పాటు, వివిధ ప్రాంతాలలో పనిచేసే కూలీలు వడగాలుల బారిన పడకుండా తగిన రక్షణ చర్యలు చేపట్టాల్సిన బాధ్యత యాజమాన్యాలపైనే ఉంటుందని రేపల్లె సహాయ కార్మిక అధికారిణి వి.సాయిజ్యోతి అన్నారు. గురువారం మండలంలోని పలు ఇటుక బట్టీలను పరిశీలించిన ఆమె బట్టీల్లోని వలస కార్మికులకు ఇటుక ఉత్పత్తిదారులు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ, కూలీల పని వేళల్లో మార్పులు చేసి ఎండ తీవ్రత, వడ గాలులు తక్కువగా ఉన్న సమయంలో మాత్రమే పనులు చేయించాలని సూచించారు. కూలీలు వడదెబ్బ బారిన పడితే వారికి తక్షణమే వైద్య సేవలు అందించడానికి అవసరమైన ఏర్పాట్లు ఉండటంతోపాటు, వారికి తరచుగా చల్లటి నీరు అందుబాటులో ఉండేవిధంగా చూసుకోవాలన్నారు. ఈసందర్భంగా ఆమె కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత



వైఎస్సార్ బీమా నగదు అందజేస్తున్న దృశ్యం

పిట్టలవానిపాలెం: వైఎస్సార్ బీమాతో పేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు ఏపీ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ అహ్మద్ హుస్సేన్ తెలిపారు. మండలంలోని చందోలు గ్రామంలో వైఎస్సార్ బీమా నగదును లబ్దిదారునికి గురువారం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన ఎస్‌కే సలీం ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. మృతుని నామినీ అయిన అతని భార్య సాకిరున్నీసాకి రూ.10 వేలు మట్టి ఖర్చుల నిమిత్తం అందజేస్తున్నట్లు తెలిపారు .వీరికి వైఎస్సార్ బీమా క్రింత రూ.5 లక్షల నగదు మంజూరైనట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు మునీర్ ఉన్నారు.

ఏట్రవారిపాలెంలో...

ఏట్రవారిపాలెం(కర్లపాలెం): ఆపదలో ఉన్న వారికి వైఎస్సార్ బీమా ఆర్థికంగా ఆసరా కల్పిస్తుందని సర్పంచ్ చీరాల వెంకటలక్ష్మి తెలిపారు. ఏట్రవారిపాలెం గ్రామానికి చెందిన సజ్జా వెంకటసుబ్బారావు అనారోగ్యంతో ఇటీవల మృతిచెందటంతో అంత్యక్రియలకు మట్టి ఖర్చుల నిమిత్తం అతని భార్య సీతకు గ్రామ సర్పంచ్ చీరాల వెంకటలక్ష్మి గురువారం వైఎస్సార్ బీమా నగదు రూ.10వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ చీరాల పద్మావతి, గ్రామ పంచాయతీ కార్యదర్శి డి.పద్మావతి, వార్డు మెంబర్ నాగిరెడ్డి, వెల్ఫేర్ అసిస్టెంట్ కృష్ణారెడ్డి, వలంటీర్లు పాల్గొన్నారు.

మహిళా రెజ్లర్లకు సంఘీభావం



చావలి బస్టాండ్ సెంటర్ వద్ద నిరసనలో పాల్గొన్న ఎస్ఎఫ్ఐ, సీఐటీయూ నాయకులు

భట్టిప్రోలు: గౌరవం, న్యాయం కోసం పోరాడుతున్న మహిళా రెజ్లర్లకు సంఘీభావాన్ని తెలియ చేస్తూ ఎస్ఎఫ్ఐ, సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం భట్టిప్రోలు చావలి బస్టాండ్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న భారత మహిళా రెజ్లర్లకు వీరు తమ సంఘీభావాన్ని తెలియచేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ బాపట్ల జిల్లా అధ్యక్షుడు పి.మనోజ్ కుమార్, సీఐటీయూ మండల కార్యదర్శి జి.సుధాకర్ మాట్లాడుతూ దేశానికి అవార్డులు తెచ్చిపెట్టిన అంతర్జాతీయ ఖ్యాతి పొందిన భారత స్టార్ మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన భారత రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్‌సింగ్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమానికి భట్టిప్రోలు మండల కో-ఆప్షన్ సభ్యుడు షేక్ సలీమ్ పాల్గొని తన మద్దతు తెలియ చేశారు.

క్రీస్తుపై నమ్మకంతో పాపాల నుంచి విముక్తి

గుంటూరు పీఠాధిపతి భాగ్యయ్య



వాక్యోపదేశం చేస్తున్న గుంటూరు పీఠాధిపతి చిన్నాబత్తిని భాగ్యయ్య

పెదనందిపాడు: ప్రతి ఒక్కరూ క్రీస్తును నమ్ముకోవాలని, ఆయనకు ప్రార్థన చేసి పాపాల నుంచి విముక్తి పొందాలని గుంటూరు పీఠాధిపతి చిన్నాబత్తిని భాగ్యయ్య ఉద్బోధించారు. స్థానిక బాల యేసు దేవాలయం నూతనీకరణ గురువారం రాత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భాగ్యయ్య వాక్యోపదేశం చేస్తూ యేసుక్రీస్తు పాపుల రక్షణ కోసమే భూలోకం జన్మించి, పాపాల విముక్తి కోసమే శిలువపై మరణించాడని తెలిపారు. యేసు చేసిన ఘనకార్యాల గురించి ప్రజలకు తెలియజేశారు. అనంతరం దివ్య పూజాబలిని సమర్పించారు. కార్యక్రమంలో స్థానిక విచారణ గురువు, వివిధ చర్చిల పాస్టర్లు, సంఘస్తులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

గుంటూరు ఈస్ట్: వృద్ధురాలు మృతి చెందిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. శశాంక్ గోయల్ కాలనీలో నివసించే పుల్లమ్మ (72) పక్షవాతంతో బాధపడుతోంది. రెండు రోజుల కిందట కుర్చీలో నుంచి కిందపడి గాయపడింది. కుమారుడు వెంకటేశ్వర్లు జీజీహెచ్‌కు తరలించాడు. అక్కడే చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

వ్యక్తి ఆత్మహత్యపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు.సంజీవయ్యనగర్‌లో నివసించే రమేష్ (51) మద్యానికి బానిసై అనారోగ్యానికి గురయ్యాడు. మానసికంగా కుంగిపోయి బుధవారం రాత్రి తన గదిలో రాడ్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుమారుడు ప్రసాద్‌బాబు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.